VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ శనివారం 28 సెప్టెంబర్ 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 45

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి భారీ వరద

2లో

# ఉద్రిక్తంగా మూసీ ప్రక్షాళన



## ఎనుముల కాదు.. ఎగవేతల రేవంత్ రెడ్డి

**అన్ని హామీలను ఎగవేస్తున్న సీఎం**

**సిద్దిపేట రైతు ధర్నాలో హరీష్ రావు**

**సిద్దిపేట:** ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కాదు.. ఎగవేతల రేవంత్ రెడ్డి అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ సర్కార్‌కు హరీశ్‌రావు డెడ్‌లైన్ విధించారు. దసరా లోపు రైతులందరికీ రుణమాఫీ చేయాలి.. లేదంటే రైతులందరితో కలిసి సచివాలయం ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 2 లక్షల రైతు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట జిల్లా నంగునూరులో రైతులు నిర్వహించిన ధర్నాలో హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు రైతులు ఏ విధంగా ఉండే.. కాంగ్రెస్ పాలనలో రైతుల పరిస్థితి ఎలా ఉంది అనేది అందరికీ అర్థమైందన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి కాకముందు రైతుల పరిస్థితి ఎలా ఉండే. రైతులకు ఎరువు బస్తా కావాలంటే పొద్దున ఐదు గంటలకు చెప్పులు లైన్లో పెడితే ఒక్క ఎరువు బస్తా దొరికేది. రైతులను ఎరువు బస్తాల కోసం లైన్ల నిలబెట్టింది కాంగ్రెస్. కానీ కేసీఆర్ ప్రతి ఊరికి ఎరువులను లారీల్లో పంపి రైతులకు అందించారు. కేసీఆర్ రాకముందు కాలిపోయే మోటర్లు, పేలిపోయే ట్రాన్స్ ఫార్మర్లు.

కేసీఆర్ వచ్చినంక 24 గంటల కరెంటు ఇచ్చిండు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలకు ఒడా కడుపునిండా రైతులకు కరెంటు ఇచ్చిండు. కాంగ్రెస్ పాలనలో దొంగ రాత్రి కరెంట్ వచ్చేది. కేసీఆర్ 24 గంటలు కరెంట్ అందించాడు. మళ్ళీ కాంగ్రెస్ పాలనలో కాలిపోయే మోటర్లు, పేలిపోయే ట్రాన్స్‌ఫార్మర్లు. కాంగ్రెస్ ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి ఏదో మీటింగ్‌లో అంటున్నారు కేసీఆర్ ఉన్నప్పుడు 24 గంటలు కరెంటు ఎట్లా వచ్చింది ఇప్పుడు ఎందుకు వస్తలేదని కరెంట్ అధికారులను ఆమె అడిగారని హరీశ్‌రావు గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి

మిగతా 2లో



## అమీన్‌పూర్ కూల్చివేతలు

### హైడ్రా కమిషనర్‌కు నోటీసులు

**హైదరాబాద్,:** అమీన్‌పూర్ చెరువుకు సంబంధించిన కేసు విషయంలో విచారణ చేపట్టిన హైకోర్టు.. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు నోటీసులు జారీ చేసింది. హైడ్రా కమిషనర్ సోమవారం విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. అమీన్‌పూర్ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందని ఇటీవల ఓ భవనాన్ని హైడ్రా సిబ్బంది కూల్చివేశారు. కోర్టులో కేసు పెండింగ్‌లో ఉందని చెప్పినా పట్టించుకోకుండా కూల్చేశారని బాధితుడు హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దీనిపై హైడ్రా కమిషనర్ వివరణ ఇవ్వాలని సూచించిన హైకోర్టు.. నేరుగా లేదా ఆన్‌లైన్ విచారణకు హాజరు కావాలని ఆదేశించింది.

**సర్వేను అడ్డుకున్న నిర్వాసితులు**

**పెట్రోల్ పోసుకుని యువకుడి ఆత్మహత్యాయత్నం**

**ఏళ్లుగా ఇక్కడే స్థలాలు కొనుక్కుని ఉంటున్నామని వెల్లడి**

**రజాపందర నగర్ వద్ద రోడ్డెక్కి ధర్నాకు**

**దిగడంతో ట్రాఫిక్ జామ్**



2లో

**మూసీనది లోపల, బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలోని నిర్మాణాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ మేరకు మొదటి విడతలో నది గర్భంలోపల కట్టుకున్న ఇళ్లు, నిర్మాణాలను తొలగించేందుకు రెవెన్యూ, మూసీ అధికారులు ముందుకుసాగుతున్నారు.**

## మాది నిర్మాణం.. మీది విధ్వంసం



2లో



2లో

## పేదల కన్నీళ్లతో ఆడుకుంటే పతనం తప్పదు

## నేడు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాక



**హైదరాబాద్:** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలంగాణలో ఒకరోజు పర్యటించనున్నారు. శనివారం ఉదయం 11.50 గంటలకు బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. తర్వాత మేడ్చల్ జిల్లాలోని శామీర్‌పేట్‌లో నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం 21వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరవనున్నారు. అనంతరం బొల్లారంలోని రాష్ట్రపతి నిలయానికి చేరుకుని.. భారతీయ కళా మహోత్సవాన్ని ప్రారంభిస్తారు. ఈ నేపథ్యంలో మేడ్చల్, హైదరాబాద్ జిల్లాల కలెక్టర్లు గౌతమ్, అనుదీప్‌లు వేర్వేరుగా భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. రాష్ట్రపతి నిలయంలో ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి, సాంస్కృతిక మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో ఆదివారం నుంచి ఎనిమిది రోజుల పాటు జరిగే భారతీయ కళా మహోత్సవంలో ఆయా రాష్ట్రాల నుంచి 430 మంది కళాకారులు పాల్గొననున్నారు. ప్రజలకు ఉచిత ప్రవేశం కల్పించారు. ఇందుకోసం రాష్ట్రపతి నిలయం అధికారిక వెబ్‌సైట్ లేదా నిలయం ముందున్న కౌంటర్‌లో వివరాలు నమోదు చేసి స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది.

## ప్రతిష్టాత్మకంగా మూసీ ప్రక్షాళన

**హైదరాబాద్:** మూసీ పరివాహక ప్రాంతంలో చారిత్రాత్మక భవనాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ సంస్కృతిని ప్రతిబింబించే కట్టడాల పరిరక్షణకు ముందుకు రావాలని ఆయన పారిశ్రామికవేత్తలకు సూచించారు. రాష్ట్రంలో సంక్షేమంతో పాటు పర్యాటక రంగాన్ని కూడా ముందుకు తీసుకెళతామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ లోని పలు పురాతన మెట్ల బావుల పునరుద్ధరణ కోసం సీఐఐ తో రాష్ట్ర పర్యాటక శాఖ శు క్రవారం ఒప్పందం చేసుకుంది. కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మూసీ ప్రక్షాళన కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంగా కారణంగా నగరంలోని అనేక చారిత్రక కట్టడాలు శిథిలావస్థకు చేరుకున్నాయని సీఎం అన్నారు. ప్రస్తుతం పాత అసెంబ్లీ భవనాన్ని పునరుద్ధరిస్తున్నామని, త్వరలోనే అందులో శాసన మండలి ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ప్రస్తుతం శాసనమండలి ఉన్న జూబ్లీ హాల్ కు చారిత్రక ప్రాధాన్యత ఉందన్నారు. ప్రత్యేక టెక్నాలజీతో ఆ భవనాన్ని నిర్మించారని, భవిష్యత్తులో దాన్ని పరిరక్షించాల్సిన అవసరముందని సీఎం అభిప్రాయపడ్డారు. జూబ్లీహాల్ ను దత్తత తీసుకొని పరిరక్షించాలని ఆయన సీఐఐకి సూచించారు. ఉస్మానియా ఆస్పత్రి భవనాన్ని పరిరక్షిస్తామని, ఇందుకోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉస్మానియా ఆస్పత్రిని గోషామహల్ స్టేడియానికి తరలిస్తున్నట్లు సీఎం వివరించారు. హైకోర్టు భవనాన్ని కూడా రక్షించాల్సిన అవసరముందని సీఎం అన్నారు. రాజేంద్రనగర్ లో హైకోర్టు నూతన భవనం నిర్మాణం కోసం 100 ఎకరాల స్థలాన్ని కేటాయించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. హైదరాబాద్ సిటీ కాలేజ్ భవనంతో పాటు పురానాపూల్ బ్రిడ్జి వంటి చారిత్రక కట్టడాలను పరిరక్షించు కోవాల్సిన అవసరముందన్నారు. ఇప్పటికే చార్మినార్ పరిరక్షణ ప్రాజెక్ట్ కొనసాగుతోందన్నారు. నగరంలో పురాతన మెట్ల బావులను పునరుద్ధరించి పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దడానికి పలువురు పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వారు ఒప్పంద పత్రాలు అందజేశారు. ఉస్మానియా యూనివర్సిటీలోని మహాలఖా మెట్ల బావి పునరుద్దరణకు ఇన్ఫోసిస్ సంస్థ ఒప్పందం చేసుకుంది. సాయి లైఫ్ సంస్థ మంచిరేవుల మెట్ల బావిని దత్తత తీసుకుంది. భారత్ బయోటెక్ సంస్థ సాలార్ జంగ్, అమ్మపల్లి బావులను పునరుద్ధరించనున్నది. అడిక్‌మెట్ మెట్ల బావిని దొడ్ల డైరీ, ఫలక్ నుమా మెట్ల బావిని టీజీ ఆర్టీసీ, రెసిడెన్సీ మెట్ల బావిని కోఠి ఉమెన్స్ కాలేజీ పునరుద్ధరించనున్నది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఉచితంగా రాష్ట్రంలో పర్యాటక, చారిత్రక ప్రాంతాలను సందర్శించే అవకాశం కల్పిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఇందుకోసం తెలంగాణ దర్శిని కార్యక్రమాన్ని తీసుకువచ్చామని, దానికి సంబంధించిన జీవోను ఇప్పటికే జారీ చేశామన్నారు. చారిత్రక, పర్యాటక ప్రాంతాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడం కోసం తెలంగాణ దర్శిని తీసుకుని వచ్చినట్లు సీఎం వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, టూరిజం ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీప్రసాద్, సీఐఐ తెలంగాణ ఛైర్మన్ సాయి ప్రసాద్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాసులు పాల్గొన్నారు.



**పర్యాటక ప్రాంతాలుగా చారిత్రక భవనాలు**

**హైదరాబాద్ సంస్కృతిని ప్రతిబింబించే కట్టడాల పరిరక్షణ**

**పురాతన మెట్ల బావుల పునరుద్ధరణ కోసం సీఐఐ ఒప్పందం**

## పేదల కన్నీళ్లతో ఆడుకుంటే పతనం తప్పదు



**హైదరాబాద్,:** హైడ్రా పేరుతో రేవంత్‌రెడ్డి సర్కార్ డ్రామాలు ఆడుతోందని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శలు చేశారు. పేదలను రోడ్డున పడేసే చర్యలు ఆపాలని డిమాండ్ చేశారు. ఏళ్లుగా ఉంటున్న వారిని ఎలా ఖాళీ చేయిస్తారని ప్రశ్నించారు. ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. మాజీ ఆర్థిక మంత్రిగా చెబుతున్నాను... రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోయింది. అప్పుల ఊబిలో రాష్ట్రం కురుకుపోయిందని అన్నారు. పేదల కన్నీళ్లతో ఆడుకుంటే రేవంత్ ప్రభుత్వానికి పతనం తప్పదని ఎంపీ ఈటల రాజేందర్ వార్నింగ్ ఇచ్చారు. హైడ్రాను నియమించిన రోజే ఇది డ్రామా అని చెప్పానని అన్నారు. హైడ్రా అధికారులు చెబుతున్న లెక్కల ప్రకారం చెరువులు, కుంటలు చుట్టూ ఉంది.. ప్రభుత్వ భూమి కాదని స్పష్టం చేశారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న పేదల ఇళ్లను కూల్చవద్దని ఎంపీ ఈటల రాజేందర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. చైతన్యపురి డివిజన్ న్యూ మారుతి నగర్ మూసీ పరిసర ప్రాంతాల్లో ఈటల రాజేందర్ శుక్రవారం పర్యటించి బాధితులకు అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ... పేదలపై కనికరం లేకుండా రేవంత్ ప్రభుత్వ చర్యలు ఉన్నాయని ధ్వజమెత్తారు. జొన్నల బండ వద్ద మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చారని వాటిని కూడా కూల్చేందుకు రేవంత్ ప్రభుత్వం పనులు చేస్తోందని ఈటల రాజేందర్ అన్నారు. మూసీని సుందరీకరణ చేస్తే తమకు ఇబ్బంది లేదు... కానీ ఎన్నడో భూమి కొన్న వారు ఇప్పటికీ ఈఎంఐలు కడుతున్నారని తెలిపారు. లక్షలు పెట్టి కొన్న ఇళ్లకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామనడ భావ్యంకాదని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఈ ప్రాంతాల్లోకి ఏనాడూ మూసీ నుంచి వరద నీరు రాలేదని తెలిపారు. హైడ్రా పేరుతో రేవంత్ ప్రభుత్వం బస్తీ ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోందని ఎంపీ ఈటల రాజేందర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ మాటలు నమ్మినందుకు ప్రజలకు ప్రశాంతత లేకుండా చేస్తున్నారని ఎంపీ ఈటల రాజేందర్ మండిపడ్డారు. ఖబడ్దార్ రేవంత్.. ప్రజలను ఇబ్బంది పెట్టే పనులు మానుకోవాలని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వానికి ఈ అంశంపై నివేదిక ఇస్తామని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. చట్టాలు, జడ్జీల మీద నమ్మకం లేకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పని చేస్తున్నారని ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. తెలంగాణ రేవంత్ జాగిర్ కాదని... ప్రజలు ఓట్లు వేస్తే సీఎం అయ్యారన్న విషయం గుర్తుపెట్టుకుని మసలుకోవాలని ఈటల సూచించారు. ప్రజల మీద దౌర్జన్యం చేయడం సరికాదని అన్నారు. అవసరమైతే లక్షలాది మందితో రేవంత్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని వార్నింగ్ ఇచ్చారు. హైడ్రా విషయంలో హైకోర్టుకు వెళ్తామని.. తాము చూస్తూ కూర్చోమని ఎంపీ ఈటల రాజేందర్ హెచ్చరించారు. బాధితులకు న్యాయం జరిగేలా రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని కోరారు.

## జగన్‌ను తిరుమల వెళ్లకుండా అడ్డుకున్నామా

అమరావతి: వైకాపా అధినేత జగన్‌ను తిరుమలకు వెళ్ల వద్దని ఎవరూ చెప్పలేదని, ర్యాలీలు, జనసమీకరణలు చేయొద్దని మాత్రమే చెప్పామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. తిరుమల అంశంపై జగన్ చేసిన ఆరోపణలు ఖండించారు. వెలగపూడిలోని సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. నోటీసులు ఇచ్చారు, నిలుపుదల చేశారని ఆరోపిస్తున్నారు.. జగన్‌కు ఏమైనా పోలీసులు నోటీసులు ఇచ్చారా అని ప్రశ్నించారు. జగన్‌ను వెళ్లొద్దని నోటీసులు ఇస్తే.. మీడియాకు చూపించాలని డిమాండ్ చేశారు. అబద్దాలు ప్రచారం చేస్తూ.. ప్రజలను ఎందుకు మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. ఇటీవల తితిదేలో చోటుచేసుకున్న పరిణామాల వల్ల భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి. దీంతో భక్తులు ఆందోళనలో ఉన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకూడదనే ఉద్దేశంతో తిరుపతిలో సెక్షన్ 30 పోలీసు యాక్ట్ అమల్లో ఉంది. ఏ మతానికైనా కొన్ని సంప్రదాయాలు, ఆచారాలు ఉంటాయి. తిరుమలకు వెళ్లాలంటే ఎవరైనా ఆచారాలు, నియమాలు పాటించాల్సిందే. ఆచారాలు పాటించకపోతే భక్తుల మనోభావాలు దెబ్బతింటాయి. భక్తులు పవిత్రంగా భావించే క్షేత్రాన్ని రక్షించాల్సిన బాధ్యత మనపై ఉంది. ఇతర మతాలను గౌరవించాలి. సొంత మతాన్ని ఆచరించాలని చంద్రబాబు అన్నారు. ఇంతకుముందు జగన్ నియమాలు ఉల్లంఘించి తిరుమల వెళ్లారు. చాలా మంది డిక్లరేషన్ ఇచ్చి గౌరవంగా దర్శనం చేసుకున్నారు. ఇతర మతాలను గౌరవించడం అంటే.. ఆయా ఆలయాల సంప్రదాయాలను పాటించడమే. బైబిల్‌ను నాలుగు గోడల మధ్యే ఎందుకు చదవాలి.. చర్చికి కూడా వెళ్లిబైబిల్ చదవొచ్చు. చెప్పిన అబద్దాన్నే పదే పదే చెబుతున్నారు. నెయ్యి కల్తీ జరగలేదని అంటున్నారు. ఏఆర్ డెయిరీ 8 ట్యాంకర్లు పంపింది.. అందులో 4 ట్యాంకర్లు వాడారు. ఈ నివేదిక ఇచ్చింది ఎన్‌డీడీబీ.. మేం కాదు. ఈ నివేదిక దాస్తే మేం తప్పు చేసినట్లే అవుతుంది. నెయ్యి కల్తీ జరగలేదని మీరు ఎలా చెబుతున్నారు. అడల్టరేషన్ పరీక్షకు గతంలో మీరు ఎందుకు పంపలేదు? టెండర్లు పిలిచేందుకు నిబంధనలు ఎందుకు మార్చారో చెప్పాలి? నాసిరకం పదార్థాలతో ప్రసాదాన్ని అపవిత్రం చేశారు. ఈవో చెప్పలేదు.. నివేదికలు లేవు అంటూ అబద్దాలు చెబుతున్నారు. రామతీర్థం, అంతర్వేది ఘటనలపై ఇప్పటి వరకు విచారణ జరగలేదు. క్రైస్తవుడిని అని ఒప్పుకొన్నాక డిక్లరేషన్ ఇచ్చేందుకు ఇబ్బంది ఏంటి? మీరు చేసిన అబద్దాలను ఖండించకుంటే అవే నిజమని అనుకుంటారు. తప్పు జరిగినప్పుడు విచారం వ్యక్తం చేయాలి.. ఎదురుదాడి కాదు. స్వామి వారికి మీరు చేసిన అపచారాలు నేను కప్పిపుచ్చాలా? రాజకీయ ముసుగులో నేరస్థులు వస్తే ఇలాంటివే జరుగుతాయని అన్నారు. రాజకీయ పార్టీకి ఉండాల్సిన లక్షణాలు, అర్హతలు మీకున్నాయా? ఇష్టమైతేనే తిరుమలకు వెళ్లండి లేకపోతే వెళ్లొద్దు. తిరుమలకు వెళ్తే ఆలయ సంప్రదాయాలు పాటించాల్సిందే. అన్య మతస్థులు ఎవరు వచ్చినా తిరుమలలో డిక్లరేషన్ ఇవ్వాల్సిందే. భక్తుల మనోభావాలు దెబ్బతీసే హక్కు మీకెవరిచ్చారు. దళితులను ఆలయాల్లోకి రానీయడం లేదని మీకెవరు చెప్పారు? సీఎంగా ఉన్నప్పుడే చట్టాలను ఉల్లంఘించానని ఎలా చెబుతారు? చట్టాలను సంప్రదాయాలను గౌరవించడంలో మొదటి వ్యక్తిగా సీఎం ఉండాలి.స్వామివారిని రాజకీయాలకు, వ్యాపారాలకు వాడుకోవడం మీరు చేసిన తప్పు. తితిదే అధికారుల నియామకంలో మీరు చేసింది అధికార దుర్వినియోగం. తిరుమలలో తెలిసీ తెలియక పొరపాట్లు చేస్తే సంప్రోక్షణ చేస్తారు. ఈ నెల 23న శాంతియాగం చేశారు. క్వాలిటీ, స్వచ్ఛత పవిత్రత చాలా ముఖ్యం. వేంకటేశ్వరస్వామి సన్నిధిలో అపవిత్రత జరగకుండా చూస్తాం. కల్తీ ఘటనలో తప్పు చేసిన అందరిపై చర్యలు ఉంటాయని చంద్రబాబు స్పష్టం చేశారు.

## దసరా తరవాత రాష్ట్రాలనికి కుకీ ఏనుగులు

**విజయవాడ:** కుంకీ ఏనుగుల అంశంపై ఏపీ-కర్ణాటక ప్రభుత్వాల మధ్య ఒప్పందం కుదిరింది. ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, కర్ణాటక మంత్రి ఈశ్వర్ ఖండ్రే సమక్షంలో ఇరు రాష్ట్రాల అటవీశాఖ అధికారులు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. కర్ణాటక నుంచి 8 ఏనుగులను ఏపీకి పంపే అంశంపై ఒప్పందం జరిగింది. చిత్తూరు, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లోని జనావాసాల్లోకి ఏనుగుల సంచారం కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ విషయంపై ఇటీవల పవన్‌కల్యాణ్ బెంగళూరు వెళ్లి కర్ణాటక మంత్రి ఈశ్వర్ ఖండ్రే, అక్కడి అధికారులతో చర్చించారు. కుంకీ ఏనుగులను పంపాలని ప్రతిపాదించగా వారు సానుకూలంగా స్పందించారు. దీనికి సంబంధించిన ఒప్పందం శుక్రవారం జరిగింది. చిత్తూరు, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాలోని జనావాసాల్లోకి ఏనుగుల సంచారం కారణంగా తలెత్తిన ఇబ్బందులను పరిష్కరించేలా కుంకీ ఏనుగులు తేవాలని నిర్ణయించామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. కర్ణాటక వెళ్లి ఆ రాష్ట్ర అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రేతో చర్చించగానే ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఏపీలో ప్రస్తుతం 23 శాతం అటవీ ప్రాంతం ఉందని.. ఇది 50 శాతానికి పెంచాలని సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొన్నారు. ప్రస్తుతం అటవీ శాఖ నిర్వహిస్తున్న క్యాంపులో ఉన్న ఏనుగులు వయసు మీరిన కారణంగా ఇబ్బందులు ఎదురువుతున్నాయని వివరించారు. అందుకే అదనంగా కొన్ని కుంకీ ఏనుగులు పంపాలని కర్ణాటకను కోరామన్నారు. వీటి ద్వారా ఏపీలోని చిత్తూరు, శ్రీకాకుళం, విజయనగరం, మన్యం జిల్లాల్లో ఏనుగుల దాడుల సమస్యను అరికట్టే అవకాశం ఉందని తెలిపారు. సరిహద్దు అటవీ ప్రాంతంలో ఎర్రచందనం స్మగ్లింగ్ లాంటి సమస్యలు సంయుక్తంగా ఎదుర్కోవాల్సి ఉంది. అటవీ అంశాలతో పాటు రాష్ట్రాల మధ్య సరిహద్దు సవాళ్లు చాలా ఉన్నాయి.. వాటిని పరిష్కరించుకోవాలి. అటవీ సంరక్షణలో కర్ణాటక ఐటీని కూడా విస్తృతంగా వినియోగిస్తోంది. పర్యటకంగానూ అటవీ ప్రాంతాన్ని సమర్థంగా వినియోగించుకుంటున్నారు. సహజ వనరులను భవిష్యత్ తరాలకు అందించేలా ఇరు రాష్ట్రాలు పని చేయాల్సి ఉందని పవన్ తెలిపారు. దసరా తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మావటిలతో సహా నాలుగు కుంకీ ఏనుగులను పంపడానికి సిద్ధంగా ఉన్నామని కర్ణాటక మంత్రి ఈశ్వర్ బి. ఖండ్రే తెలిపారు.. ఈ భేటీలో రెండు రాష్ట్రాల అటవీ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.. అనంతరం మీడియాతో ఈశ్వర్ బి. ఖండ్రే.. ఈ ఎంఓయూ కి సహకరించిన ఇరు రాష్ట్రాల సీఎంలు, డిప్యూటీ సీఎంలు, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు..

ఎంఓయూ ద్వారా స్మగ్లింగ్ ను అరికట్టడానికి ఉపయోగపడుతుందన్నారు ఈశ్వర్.. ఏనుగుల దాడి అంశంలో కుంకీ ఏనుగులు బాగా ప్రావీణ్యం కలిగిన మావటీలతో అందిస్తామని వెల్లడించారు.. ఆంధ్రప్రదేశ్‌లో కర్ణాటక మావటీలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.. మా దగ్గర ఉన్న ఫారెస్ట్ గవర్నెన్స్ ట్రాకింగ్ టెక్నాలజీ ఏపీకి ఇవ్వడానికి మేం అంగీకరించామని తెలిపారు.. ఎకో టూరిజంలో ఉన్న అవసరాలను మేం గుర్తించి.. రెండు రాష్ట్రాల మధ్య ఒక ఒప్పందానికి వచ్చామని తెలిపారు.. అటవీ సంపదను, వన్యప్రాణులను కాపాడుకోవడం కోసం ఈ ఎంఓయూ చేసుకున్నాం అన్నారు.. ఇక, కుంకీ ఏనుగులను ఏపీకి పంపించడానికి మేం సిద్ధంగా ఉన్నాం.. దసరా తర్వాత మావటీలతో సహా నాలుగు కుంకీ ఏనుగులను పంపడానికి రెడీగా ఉన్నామని కర్ణాటక మంత్రి ఈశ్వర్ బి. ఖండ్రే వెల్లడించారు.

## తిరుమలను అపవిత్రం చేసిన ఘనత జగన్‌దే



**విజయవాడ:** తిరుమల లడ్డూ ప్రసాదాన్ని కూడా వైసీపీ ప్రభుత్వం కల్తీ చేసిందని బీజేపీ ఏపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి అన్నారు. అన్యమతస్తులను టీటీడీలోకి తీసుకోవద్దని చెప్పినా కూడా ఆనాడు మాజీ సీఎం జగన్ తమ మాట వినలేదని అన్నారు. తిరుమల గురించి లక్షలాది మంది సంతకాల సేకరణ చేసి ఇచ్చినా జగన్ ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. బీజేపీ సభ్యత్వ నమోదుపై రాష్ట్రస్థాయి సమావేశం శుక్రవారం జరిగింది. బీజేపీఅధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పలువురు ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దగ్గుబాటి పురంధేశ్వరి మాట్లాడుతూ... ఏపీలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉచిత ఇసుక విధానాన్ని ప్రజల కోసం అమలు చేస్తోందని దగ్గుబాటి పురంధేశ్వరి తెలిపారు. నేడు ఏపీలో ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో మంచి పాలన సాగుతుందని అన్నారు. 13 జిల్లాల్లో వైసీపీ నేతలకు నచ్చిన వారికి ఇసుక రీచ్‌లు కట్టబెట్టి దోపిడీ చేశారని దగ్గుబాటి పురంధేశ్వరి ఆరోపించారు. జగన్ ప్రభుత్వంలో జరిగిన అవినీతిని ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని అన్నారు. బీజేపీ ప్రజల పక్షాన నిలబడుతుందని.. వారి కోసం కార్యకర్తలు, ఎన్డీఏ కూటమి నేతలు కలిసి నడవాలని పిలుపునిచ్చారు. కేంద్ర బ్జడెట్‌లో కూడా ఏపీ అభివృద్ధికి మోదీ ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని చెప్పారు. పోలవరం నిర్మాణం కూడా పూర్తి చేసి, రైతుల కల నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. విశాఖపట్నం స్టీల్ ఎ÷-లాంట్ ప్రైవేటీకరణపై కొంతమంది రాద్ధాంతం చేస్తున్నారని దగ్గుబాటి పురంధేశ్వరి మండిపడ్డారు. స్టీల్ పాంట్‌ను లాభాల బాటలో ఎలా నడిపించాలనే దానిపై ఇటీవల సీఎం చంద్రబాబు కూడా సమీక్ష చేశారని దగ్గుబాటి పురంధేశ్వరి గుర్తుచేశారు. ఇప్పుడు ఉన్న భాగస్వామ్యాన్ని అదే విధంగా కొనసాగిస్తూ.. లాభాల్లో నడిచేలా కార్యాచరణ రూపొందిస్తామని దగ్గుబాటి పురంధేశ్వరి స్పష్టం చేశారు. గతంలో అభివృద్ధి పుల కోసం కేంద్ర ప్రభుత్వం వైసీపీ ప్రభుత్వాన్ని భూమిని కేటాయించాలని అడిగితే నిరుపయోగమైన భూమిని ఇచ్చారని అన్నారు. కానీ నిందలు మాత్రం కేంద్ర ప్రభుత్వంపై వేసి జగన్ తప్పుకున్నారని ధ్వజమెత్తారు. ప్రైవేటీకరణ పేరుతో జగన్ ప్రభుత్వం చేసిన అసత్యాలను తిప్పి కొట్టాలని దగ్గుబాటి పురంధేశ్వరి అన్నారు. చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే భూమిని కేటాయించారని చెప్పారు. గ్రామాలు అభివృద్ధి చెందకుండా నిధులను జగన్ ప్రభుత్వం దారి మళ్లించిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 13వేల పైబడి పంచాయతీల్లో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఒకే సమయంలో గ్రామసభలు నిర్వహించారని దగ్గుబాటి పురంధేశ్వరి ప్రశంసించారు.

## మాది నిర్మాణం..మీది విధ్వంసం



**హైదరాబాద్:** ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోని అక్రమ నిర్మాణాల కూల్చివేతలే లక్ష్యంగా హైడ్రా దూసుకుపోతోంది. ఇప్పటికే కొన్ని వందల నిర్మాణాలను హైడ్రా కూల్చివేసింది. అనేక మందికి నోటీసులు కూడా ఇచ్చారు. తాజాగా మూసి పరిధిలో అక్రమ నిర్మాణాలపై హైడ్రా కన్నేసింది. గోల్నాక, చాదర్‌ఘాట్, మూసారంబాగ్.. మూసి ఆక్రమణల కూల్చివేతలకు రంగం సిద్ధమైంది. ఈ క్రమంలో 1,350 మందికి హైడ్రా నోటీసులు జారీ చేసింది. ఇప్పటికే ఎఫ్టీఎల్, బఫర్ జోన్‌లో ఇళ్లను హైడ్రా మార్క్ చేసింది. అయితే హైడ్రా కూల్చివేతలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎక్స్ వేదికగా కేటీఆర్ స్పందిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వంపై ఫైర్ అయ్యారు. హైడ్రా టార్గెగా మాజీ మంత్రి విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ విష ప్రచారాలు అబద్దాలు అనడానికి మరో సాక్ష్యం ఇదే అంటూ పేర్కొన్నారు. మేము నిర్మిస్తే - మీరు కూల్చేస్తున్నారు.. మాది నిర్మాణం - మీది విధ్వంసం.. లక్షల నిర్మాణాలు మావి - లక్షల కూల్చివేతలు మీవి. మూసి నది సాక్షిగా ఇదిగిదిగో మహానగరంలో కేసీఆర్ లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు. కాంగ్రెస్ విష ప్రచారాలు అబద్దాలు అనడానికి మరో సాక్ష్యం ఇదే. కట్టలేదన్నారు - ప్రజలను మభ్యపెట్టాం అన్నారు - మరి లక్ష ఇండ్లు రాత్రికి రాత్రికి ఎక్కడ నుంచి పుట్టుకొచ్చాయి చిట్టి.. మీ పాలనలో మీ అధికారులే మీ టేబుల్ ముందు పెట్టిన డబుల్ లెక్కలు చూసి మతిపోతుందా.. కేసీఆర్ నిజం, అయన హామీలు నిజం ఆయన మాట నిజం అని తెలిసి మింగుడుపడటం లేదా. మీ జూటా మాటలు, మీ కుట్రలకు, మీ దిమాక్ తక్కువ పనుల డ్యామేజ్ కంట్రోల్‌కు ఇవ్వాళా కేసీఆర్ నిర్మాణాలే దిక్కయ్యాయి. కేసీఆర్ లక్ష డబుల్ నిర్మాణాలు నిజం - కేటాయింపులు నిజం. మీ నాలుకలు తాటి మట్టాలు కాకుంటే ఇంకోసారి అబద్దాలు మాట్లాడకండి' అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

## మంత్రి పొంగులేటి నివాసాలపై ఇడి దాడులు



**హైదరాబాద్:** తెలంగాణ రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి నివాసాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు సోదాలు చేపట్టారు. ఢిల్లీ నుంచి వచ్చిన అధికారుల బృందం ఏకకాలంలో 15 చోట్ల తనిఖీలు చేస్తోంది. గత ఎన్నికల సమయంలో పొంగులేటి శ్రీనివాస రెడ్డి నివాసాల్లో అధికారులు సోదాలు చేపట్టారు. జూబ్లీహిల్స్‌లోని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఇంట్లో ఈడీ అధికారులు తనిఖీలు చేపట్టారు. హిమాయత్ సాగర్‌లో గల ఫామ్ హౌస్, పొంగులేటి శ్రీనివాస రెడ్డి కూతురు, బంధువుల ఇళ్లలో రైడ్స్ కొనసాగుతున్నాయి. పొంగులేటి శ్రీనివాస రెడ్డికి చెందిన రాఘవ కన్ స్ట్రక్షన్స్ ఇన్ ఫ్రా కార్యాలయాల్లో ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు. కంపెనీ ఎండీ, డైరెక్టర్ల నివాసాలు, కార్యాలయాల్లో 15 బృందాలు తనిఖీలు చేపట్టింది. ఖమ్మంలో ఉన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ ఇంటిలో రైడ్స్ కొనసాగుతున్నాయి. ఢిల్లీ జోనల్ అధికారులు తనిఖీలు చేపట్టారని తెలిసింది. నారాయణ పేట- కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును రాఘవ కన్ స్ట్రక్షన్ కంపెనీ దక్కించుకుంది. దీనికి సంబంధం లేదని తెలుస్తోంది.

## శ్రీవారి దర్శనానికి మాజీ సిఎంపై ఆంక్షలా

**తిరుమల వెళతానంటే ఎందుకంత ఆందోళన**

**బిజెపి నేతలు ఎందుకీ రాజకీయం చేస్తున్నారు**

**మండిపడ్డ మాజీమంత్రి అంబటి రాంబాబు**

గుంటూరు: తిరుమల శ్రీవారిని దర్శించుకోవడానికి ఒక మాజీ ముఖ్యమంత్రికి అనుమతి లేకపోవడం ఏంటని వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు ప్రశ్నించారు. దైవ దర్శనానికి పోలీసుల నుంచి అనుమతి తీసుకోవడం ఏనాడైనా ఉందా అని నిలదీశారు. జగన్ తిరుమల పర్యటన రద్దయిన నేపథ్యంలో తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అంబటి రాంబాబు మాట్లాడారు. వైఎస్ జగన్ తిరుపతి వెళ్తుంటే రాష్ట్ర ప్రభుత్వానికి ఎందుకు అంత ఆందోళన అని అంబటి రాంబాబు ప్రశ్నించారు. జగన్ తిరుపతి ఎలా వస్తాడో చూస్తామని కొందరు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. హైదరాబాద్‌కు చెందిన బీజేపీ నేతలు, తిరుపతి జనసేన నేతలు, టీడీపీ వారూ అందరూ ఇలాగే మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇంత విచిత్రమైన పరిస్థితిని తానెప్పుడూ చూడలేదని అన్నారు. కేవలం ఆరుగురితో శ్రీవారి దర్శనానికి వెళ్లాలని వైఎస్ జగన్ వెళ్లాలని అనుకున్నారని అంబటి రాంబాబు తెలిపారు. కానీ ఆయన వెంట ఎవరూ వెళ్లకూడదంటూ వైసీపీ నాయకులకు పోలీసులు నోటీసులు ఇచ్చారని అన్నారు. అయినా జగన్ వెంట ఎవరూ వెళ్లొద్దంటూ పోలీసులు ఆంక్షలు పెట్టడమేంటని ప్రశ్నించారు. వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడానికి మాజీ సీఎం అనుమతి లేకపోవడం ఏంటని అడిగారు. దేవుడి దర్శనానికి ఒకరి అనుమతి కావాలా? దైవ దర్శనానికి పోలీసుల నుంచి అనుమతి తీసుకోవడం ఏనాడైనా ఉందా? అని ప్రశ్నించారు. డిక్లరేషన్ ఇవ్వాలని సీఎం చంద్రబాబు, బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి మాట్లాడుతున్నారని అంబటి రాంబాబు తెలిపారు. వేంకటేశ్వర స్వామిని రాజకీయం కోసం వాడుకోవడం నీచాతినీచమని విమర్శించారు. వైఎస్ఆర్, వైఎస్ జగన్ అనేకసార్లు శ్రీవారిని దర్శించుకున్నారని.. పట్టువస్త్రాలు సమర్పించారని గుర్తుచేశారు.

చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనూ జగన్ తిరుమలకు వెళ్లారని తెలిపారు. అప్పుడు ఎప్పుడూ రాని అభ్యంతరం ఇప్పుడు ఎందుకు వస్తుందని ప్రశ్నించారు. శ్రీవారి లడ్డూ చుట్టూ రాజకీయం చేసి మీరు బాగుపడాలని ప్రయత్నం చేస్తే మీకే నష్టమని ఏపీ సీఎం చంద్రబాబును అంబటి రాంబాబు హెచ్చరించారు. 0 వేల మందితో జగన్ దర్శనానికి వెళ్తున్నారని పోలీసులు నోటీసులు ఇవ్వడం బాధాకరమని అన్నారు. చంద్రబాబు అగ్లీ చేష్టలను ప్రజలు హర్షించరని విమర్శించారు.

## ఎనుముల కాదు.. ఎగవేతల రేవంత్ రెడ్డి



ఏమైంది? కరోనా లేదు అయినా కూడా కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు ఇవ్వడం లేదని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. కేసీఆర్ ఉండగా నాట్లు పడే వరకు రైతుల ఫోన్లలో టింగు టింగ్ అని రైతుబంధు పడేది. ఇప్పుడు నాట్లు అయి, కలుపై, పంటకు మందు కొట్టుడు కూడా అయిపోయింది. పంట కోతకు ఉన్నా, దసరా పండుగ దగ్గరకు వస్తున్నా ఇంకా రైతుబంధు పడలేదు. మాటలు మాత్రం కోటలు దాటుతాయి. అన్ని వంకర మాటలే కానీ రైతులకు మాత్రం రైతుబంధు వేస్తలేదు రేవంత్ రెడ్డి. రైతుబంధుకు కేసీఆర్ ఉండంగా ఎకరానికి రూ.4,000 ఇచ్చిండు. మళ్లీ గెలిస్తే రూ.5,000 ఇస్తానని ఇచ్చిండు. మళ్లీ గెలిస్తే రూ. 8,000 చేస్తా అన్నాడు గెలిస్తే చేస్తుండే. కాంగ్రెస్ గెలిచి రూ. 7,500 రైతుబంధు ఇస్తా అన్నారు. పోయిన యాసంగికి రూ. 5,000 ఇచ్చింద్రు. ఈ పంటకు మొత్తానికి ఎగబెట్టారని హరీశ్‌రావు మండిపడ్డారు. ల్గ÷తులను అప్పుల పాలు చేస్తున్నడు రేవంత్ రెడ్డి. పంట పెట్టుబడి కోసం రైతులు అప్పులు చేసే పరిస్థితి ఏర్పడింది. అబద్దాలు చెప్పి కుంటి సాకులు చెప్పి ఇప్పటిదాకా రైతులకు రైతుబంధు పైసలు ఇవ్వలేదు. రాష్ట్రంలో రైతులను ఆగం చేయడం కాదా? కేసీఆర్ ఒక్కసారి కాదు 11 సార్లు రైతుబంధు ఇచ్చిండు. ఊరు ఊరుకి కొనుగోలు కేంద్రాలు పెట్టి టైమ్‌కు వడ్లు కొనుడు అయినా, వడ్లను కొన్న పైసలు కూడా మూడు రోజులనే రైతులకు అందించిండు కేసీఆర్ అని హరీశ్‌రావు తెలిపారు.రేవంత్ రెడ్డి కాళేశ్వరం కూలిపోయింది అంటున్నాడు. వచ్చి రంగనాయక సాగర్, మల్లన్న సాగర్ చూడు రేవంత్ రెడ్డి. కాళేశ్వరం కూలిపోతే నీళ్లు ఎట్లా వచ్చినాయో చూడు మరి. రేవంత్ రెడ్డికి కూలగొట్టుడు తప్ప కట్టుడు తెలవదు. కాళేశ్వరంలో 100 భాగాలు ఉంటాయి. ఒక్క భాగంలో 160 పిల్లర్లలో రెండు పిల్లర్లకి చిన్న పగుళ్లు వచ్చినాయి దానికి కాళేశ్వరం మొత్తం కూలిపోయిందని అబద్ధ ప్రచారం చేస్తున్నాడు. ఎన్నడైనా ఏదైనా కట్టిన ముఖం అయితే రేవంత్ రెడ్డికి తెలిసేది. కాళేశ్వరంలో మూడు బ్యారేజీలు, 19 పంప్ హౌస్‌లు, 18 రిజర్వాయర్లు, సొరంగాలు, కాలువలు, పైపులైన్లు. ఇండ్ల రెండు పిల్లర్లకు మాత్రమే పగుళ్లు వచ్చాయని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

## శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి భారీ వరద ప్రాజెక్టు 22 వరద గేట్ల ఎత్తివేత

నిజామాబాద్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ నుంచి భారీ వరద నీరు వచ్చి చేరుతోంది. ఇన్‌ఫ్లో 1.09 లక్షల క్యూసెక్కులకు చేరుకుంది. దీంతో ప్రాజెక్టు 22 వరద గేట్లను ఎత్తి గోదావరిలోకి 82వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. కాకతీయ కాలువకు 6800 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా గోదావరిలోకి 1200 క్యూసెక్కులు విడుదల చేయడంతో జల విద్యుత్ కేంద్రంలోని నాలుగు టర్బయిన్ల ద్వారా 36.40 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందని జెన్ కో డీఈ శ్రీనివాస్ తెలిపారు. వరద కాలువ హెడ్ రెగ్యులేటర్ ద్వారా దిగువ ఎల్ఎండీకి 19 వేల క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నారు. మంజీర, గోదావరి నదులు మళ్లీ ఉప్పొంగాయి. మహారాష్ట్ర, కర్ణాటకలో రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. శ్రీరాంసాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టులకు వరద పోటెత్తడంతో మిగులు జలాలను దిగువకు వదులుతున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టుకు 16 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో మూడు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. దీంతో బోధన్ మండలం సాలూర వద్ద పాత వంతెనను ఆనుకుని మంజీరా నది ప్రవహిస్తున్నది.

వేగుచుక్క
TELUGU DAILY NEWS

# ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు.





**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, సెప్టెంబర్ 27**

: తెలంగాణవాది, స్వాతంత్ర్య పోరాట యోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 109 జయంతి వేడుకను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా జయంతి ఉత్సవాలు జరిపారు. అర్బన్ శాసనసభ్యులు ధన్పాల్ సూర్యనారాయణ, నగర మేయర్ నీతూ కిరణ్, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, బీ.సి, పద్మశాలి కుల సంఘాల ప్రతినిధులు, తదితరులు వినాయకనగర్ లోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన జయంతి కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తుది శ్వాస వరకు అంకితభావం, నిజాయితీగా కృషి చేసిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని ప్రశంసించారు. కేవలం తెలంగాణ ఉద్యమంలోనే కాకుండా దేశ స్వాతంత్ర్య పోరాటంలోనూ పాల్గొన్నారని, చట్టసభల్లో గళమెత్తి తన పదవులను తృణప్రాయంగా వదులుకున్న త్యాగశీలి అని గుర్తు చేశారు. ఆ మహనీయుడి గురించి ఎంత పొగిడినా తక్కువే అవుతుందని, తెలంగాణ సమాజంలో జన్మించిన ఆణిముత్యం కొండా లక్ష్మణ్ బాపూజీ అని అభివర్ణించారు. ఆయన త్యాగాలు, పోరాట పటిమను నేటి తరానికి తెలియజేసేలా తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా జయంతి ఉత్సవాలను నిర్వహిస్తోందన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాల సాధనకు అందరూ పాటుపడాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రమేష్, సహాయ అభివృద్ధి అధికారి నర్సయ్య, పద్మశాలి, బీసీ కుల సంఘాల నాయకులు పులగం హనుమాండ్లు, బిజ్జ దత్తాద్రి, రాష్ట్ర మహిళా సంఘం అధ్యక్షురాలు గుజ్జ రాజేశ్వరి, నగర పద్మశాలి సంఘం అధ్యక్షుడు వెంకట నర్సయ్య, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి మురళి, పద్మశాలి ఆత్మీయ సమితి అధ్యక్షుడు గురుచరణం, జిల్లా మహిళా సంఘం అధ్యక్షురాలు చంద్రభాగ, పి.నర్సయ్య, సామాజిక కార్యకర్త బంగారు సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# బాపూజీ ఆశయాలకు సాధనకు కృషి.



## - జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, సెప్టెంబర్ 27:**

కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా శుక్రవారం కామారెడ్డి బస్ స్టాండ్ సమీపంలోని ఆయన విగ్రహానికి కలెక్టర్ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ రంగనాథ్ రావు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి చందర్ నాయక్, మున్సిపల్ కమిషనర్ సుజాత, వివిధ శాఖల అధికారులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమానికి ఊపిరిపోసిన కొండ లక్ష్మన్ బాపూజీ.

## - అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, సెప్టెంబర్ 27:**



తెలంగాణ ఉద్యమానికి ఊపిరిపోసిన నేత కొండ లక్ష్మన్ బాపూజీ అని అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ అన్నారు. స్వాతంత్ర సమరయోధులు, తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమకారులు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో వినాయక నగర్ లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, బాపూజీ భారతమాత బానిస సంకెళ్ళు తెంచడానికి స్వాతంత్రోద్యమ సమయంలో క్విట్ ఇండియా, వందేమాతరం ఉద్యమలలో కీలకంగా పని చేశారని అన్నారు. స్వాతంత్రం అనంతరం హైదరాబాద్ సంస్థానంగా తెలంగాణ బిడ్డల పై జరుగుతున్నా అకృత్యాలకి నిరసనగా నిజాం రాజుకి ఎదురు తిరిగి తెలంగాణ రైతంగా పోరాటంలో నిజాం అక్రమంగా నిర్బంధించిన నాయకులకు అండగా నిలిచిన మహనీయులు బాపూజీ అన్నారు. బాపూజీ ప్రజాప్రతినిధిగా సేవాలాందించి, సహకార సంఘాల రూపాకల్పనకు నాంది పలికారన్నారు. చేనేత, కుల వృత్తులను సహకార రంగంలోకి తెచ్చి, వాటిని అభివృద్ధి చేసిన ఘనత బాపూజీది అన్నారు. దేశంలో సైకిల్, పాదయాత్రలకు శ్రీకారం చుట్టిన మహనీయులు బాపూజీ అని మూసి వరదల సమయంలో 220 మైల్లు పాదయాత్ర చేసి పునరావాస కేంద్రాలను స్వయంగా పర్యవేక్షించడం జరిగిందని అది ఆయన సేవకు నిదర్శనం అన్నారు. నేటి యువతరం లక్ష్మణ్ బాపూజీని ఆదర్శంగా తీసుకోవాలని వారి ఆకాంక్షలను నెరవేర్చే విదంగా బంగారు తెలంగాణ కళ సాకారం కోసం పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అరవింద్, బీజేపీ నాయకులు, పద్మశాలి సంఘం పెద్దమనుషులు పాల్గొన్నారు.

# గల్ఫ్ కార్మికులు కోసం ప్రత్యేక కౌంటర్ ప్రారంభం.

**వేగుచుక్క న్యూస్, హైదరాబాద్, సెప్టెంబర్ 27:**



జ్యోతిరావు పూలే ప్రజా భవన్ లో ప్రవాసి ప్రజావాణి పేరిట గల్ఫ్ కార్మికులు, ఎన్నారై ల కోసం ప్రత్యేక కౌంటర్ ను శుక్రవారం ప్రారంబించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ గారు, ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, పిసిసి ఎన్ఆర్ఐ సెల్ ఛైర్మన్ వినోద్, కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గం ఇన్చార్జి వినయ్ రెడ్డి, ప్రజావాణి నోడల్ ఆఫీసర్లు, ఇతర ఎన్నారై విభాగం నేతలతో కలిసి ప్రారంభించారు. గల్ఫ్ దేశాల్లో ఇబ్బందులు పడుతున్నా షేక్ హుస్సేన్ కుటుంబం నుండి మొదటి అభ్యర్థనను స్వీకరించగా,సమస్యల వినతి కోసం భారీగా గల్ఫ్ కార్మికులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి

మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఎన్నికల్లో చెప్పినట్టు 4 అంశాల పై నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. అందులో మొదటిది తెలంగాణ ప్రభుత్వం పక్షాన ప్రజా భవన్ లో ప్రవాసి ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. రాష్ట్రం నుండి గల్ఫ్ దేశాలకు పెద్ద ఎత్తున ఉపాధి నిమిత్తం వెళ్ళారని, వారి సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవడానికి ఇది ఉపయోగ పడుతుందనీ పేర్కొన్నారు.గల్ఫ్ ప్రమాదంలో చనిపోయిన వారికి 5 లక్షల ఎక్స్ గ్రేషియ ఇవ్వడానికి ఇప్పటికే జీవో జారీ చేసుకున్నాం అని, గల్ఫ్ కార్మికుల కుటుంబాల పిల్లల చదువులకు ఇబ్బందులు లేకుండా గురుకులాల్లో సీట్లు కల్పిస్తున్నాం అన్నారు. గల్ఫ్ కార్మికుల కోసం ఉత్తర తెలంగాణ ప్రాంతం నుండి ప్రాతినిద్యం వహిస్తున్న ఎమ్మెల్యేలతో అడ్వైజరి కమిటీ ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు.

# లింగన్నపేట్ ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం.

## - జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.







**వేగుచుక్క న్యూస్, లింగంపేట్, సెప్టెంబర్ 27:**

లింగన్నపేట్ గ్రామాన్ని ఆదర్శవంతంగా, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శుక్రవారం రోజున లింగంపేట్ నాగన్న బావి వద్ద ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, లింగంపేట్ లోని నాగన్న బావి వలన పర్యాటక ప్రాంతంగా పరిగణించుకోవచ్చని అన్నారు. భవిష్యత్తు తరాల వారికి నాటి కట్టడాలను చూపించ వచ్చని తెలిపారు. ఈ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి పరచడానికి స్థానిక. మహిళా సంఘాల వారు బాధ్యతగా నిర్వహణ చేయవచ్చని సూచించారు. రెస్టారెంట్, హోటల్ వంటివి ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పండుగల సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా పాఠశాలల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు నోటు పుస్తకాలను కలెక్టర్
పంపిణీ చేసారు. తొలుత మహిళా సమాఖ్య సభ్యులు తయారు చేసిన పిండి వంటలను కలెక్టర్ పరిశీలించి రుచి చూశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ప్రభాకర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా పరిషత్ సి.ఈ.ఓ. చందర్ నాయక్, మండల అధికారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# టియు భూములను కబ్జాల నుండి కాపాడాలి.

## - పిడిఎస్ యూ డిమాండ్.

**వేగుచుక్క న్యూస్, డిచ్ పల్లి, సెప్టెంబర్ 27:**



కబ్జాకు గురవుతున్న తెలంగాణ యూనివర్సిటీ భూములను కాపాడాలని పిడిఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం తెలంగాణ యూనివర్సిటీలో ఆర్ట్స్ కాలేజ్ వద్ద విలేఖర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గతంలో యూనివర్సిటీ భూములను కబ్జా చేస్తుంటే పి.డి.ఎస్.యూ గా పోరాటం చేసి కోర్టులో కేసు గెలవడానికి కృషి చేసిందని అన్నారు. ఇప్పుడు యూనివర్సిటి భూమి పై హైకోర్టు లో కేసు వేసి అన్యాయంగా అక్రమంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ గుప్పిట్లోకి తెచ్చుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. దీన్ని మేం చూస్తూ ఊరుకోం, తెలంగాణ యూనివర్సిటీ సాధించుకున్న విద్యార్థులుగా, మళ్ళీ భూములను కాపాడుకోవడానికి పోరాడుతాం అని అన్నారు. యూనివర్సిటీ భూముల జోలికి వస్తె ఖబర్దార్ అని, ఒక్క అంగుళం భూమిని కూడా వదిలే ప్రసక్తే లేదని, ఎంతటి వాళ్ళకైనా ఎదురు వెళ్తాం అని అన్నారు.ఈ కార్యక్రమంలో తే.యూ పి.డి.ఎస్.యూ నాయకులు రవీందర్, బిందు, హనుమాండ్లు, వేణు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ పోరు కెరటం కొండా లక్ష్మణ్ బాపూజీ.

## - సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య.

**వేగుచుక్క న్యూస్, సిరికొండ, సెప్టెంబర్ 27:**



దేశ సేవకు, సమాజ హితానికి కంకణ బద్ధుడై, ఉద్యమ చరిత్రనే తన జీవిత చరిత్ర పుటలుగా మలుచుకుని, మూడు తరాల ఉద్యమాలలో పాల్గొన్న ఉద్యమ వీరుడు, తెలంగాణ స్వయం పాలన పోరు కెరటం కొండా లక్ష్మణ్ బాపూజీ అని సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య అన్నారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతిని సత్యశోధక్ పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మొదటగా ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య ఉపాధ్యాయులతో కలిసి కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ, నిరంతర ఉద్యమాలతో పాటు ప్రజాప్రతినిధిగా ప్రజాసేవ కోసం తపించారని, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాంకిడిలో జన్మించిన కొండా లక్ష్మణ్, న్యాయవాద విద్యను అభ్యసించి, ప్రగతిశీల భావ నాయకత్వంతో స్వాతంత్ర్యోద్యమంలో, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ విముక్తి పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారని అన్నారు. తెలంగాణ కోసం 1969లో మంత్రి పదవిని కూడా తృణప్రాయంగా వదిలిలేసిన నిబద్ధత కలిగిన రాజకీయవేత్తయని, దశాబ్దాల తెలంగాణ కల సాకారమైన వేళ ఆ స్వప్నాన్ని మాత్రం ఆయన చూడలేక పోయిన నిఖార్సయిన తెలంగాణ వాది లక్ష్మణ్ బాపూజీ అని అన్నారు. తెలంగాణ ఉద్యమ అమర వీరులు కలలుగన్న ప్రగతి శీల, నవీన సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది,

# 29 న ట్రస్మా అధ్వర్యంలో "గురుపూజోత్సవం".

## - జిల్లాలోని 250 మంది ప్రైవేట్ పాఠశాలల్లోని ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, సెప్టెంబర్ 27**

ట్రస్మా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 29న బృందావన్ గార్డెన్ లో "గురుపూజోత్సవం" కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు రాస నిత్యానందం, కార్యదర్శి గోజూరి అరుణ్, కోశాధికారి ఉప్పల మధు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండీ 250 ప్రైవేటు విద్యాసంస్థల నుండీ ఒక్కొక్క టీచర్ చొప్పున ఉత్తమ ఉపధ్యాయులను ఎంపిక చేసి సన్మానించడం జరుగుతుందని తెలిపారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అర్బన్ ఎంఎల్ఏ ధనపాల్ సూర్య నారాయణ గుప్త, రూరల్ ఎంఎల్ఏ రేకులపల్లి భూపతి రెడ్డి, జిల్లా విద్యా శాఖాధికారి దుర్గా ప్రసాద్, ప్రత్యేక ఆహ్వానితులుగా స్టేట్ ట్రస్మ చీఫ్ అడ్వైజర్ యాదగిరి శేఖర్ రావు, స్టేట్ ప్రెసిడెంట్ మధుసూదన్, స్టేట్ ట్రస్మ స్పోక్స్ పర్సన్ సేపూర్ జయసింహగౌడ్ హాజరు కానున్నట్లు వారు తెలిపారు.

వేగుచుక్క
శనివారం 28 సెప్టెంబర్ 2024




# దేవర మూవీ చూస్తూ ...అభిమాని హఠాన్మరణం

ఎన్టీఆర్ నటించిన 'దేవర' చిత్రం థియేటర్లలోకి రావడంతో అభిమానులు ఎంతో ఉత్సాహంగా తమ అభిమాన హీరో సినిమా చూసేందుకు థియేటర్ల బాట పట్టారు. అదే విధంగా ఓ అభిమాని కూడా ఎన్టీఆర్ సినిమా చూసేందుకు థియేటర్‌కు వెళ్లాడు. సినిమా చూస్తూ ఎంతో ఎంజాయ్ చేశాడు. ఈలలు, కేకలు వేస్తూ సందడి చేస్తూ ఒక్కసారి కూప్పకూలిపోయాడు. అనుహ్యంగా ఒక్కసారిగా జరిగిన ఓ ఘటనతో థియోటర్లోని ప్రేక్షకులు అవాక్కయ్యారు. ఈ ఘటన కడప జిల్లాలో చోటు చేసుకుంది. నగరంలోని అప్సర థియేటర్‌లో 'దేవర' చిత్రం విడుదల సందర్భంగా అపశృతి చోటు చేసుకుంది. సినిమా చూస్తున్న క్రమంలో ఓ అభిమాని కేకలు వేస్తూ ఒక్కసారిగా కుప్పకూలాడు. వెంటనే అతడిని హుటాహుటిన ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వ్యక్తిని పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు మృతి చెందినట్లు ధృవీకరించారు. మృతుడు సీకే దీన్నె మండలం జమాల్ పల్లికి చెందిన మస్తాన్ వలిగా గుర్తించారు. ఎంతో ఉత్సాహంగా తమ అభిమాన హీరో జూనియర్ ఎన్టీఆర్ నటించిన 'దేవర' సినిమాను చూసేందుకు వచ్చిన అభిమాని ఇలా హఠాన్మరణం చెందడం అక్కడి వారిని తీవ్రంగా కలిచివేసింది. మస్తాన్ వలి మృతితో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.



# సముద్రతీరం నేపథ్యం... ఆధిపత్యం పోరాటం

చేసుకుందామని చెబుతాడు. అందుకు భైర (సైఫ్ అలీఖాన్) అంగీకరించడు. దేవరను తప్పించి తను సంద్రాన్ని శాసించాలనుకుంటాడు. దాంతో ఇద్దరి మధ్య అంతర యుద్ధం మొదలవుతుంది. దేవర మాత్రం ఊరికి దూరంగా ఉంటూ సంద్రం ఎక్కాలంటే భయపడేలా చేస్తాడు. దాంతో దేవర ప్రాణం తీయడానికి పన్నాగం పన్నుతాడు భైర. ఆ తర్వాత ఏం జరిగింది. అజ్ఞాతంలో ఉన్న తండ్రి దేవర కోసం భయం భయంగా ఉండే వర (ఎన్టీఆర్) ఏం చేశాడు.
అసలు రత్నగిరి, ఎర్ర సముద్రంలో ఏం జరిగింది అనేది కథ. రత్నగిరి అనే ప్రాంతంలో సముద్రం, అందులో జరిగే వ్యాపారం, ఆ ప్రాంతంలో బతుకుతెరువు కోసం పనిచేసే మనుషులు ఇతివృత్తంగా సాగే కథ ఇది. బ్రిటీష్ కాలం, ఎర్ర సముద్రం, ఆ ప్రాంత వాసుల ఘనత, ఆ సముద్రానికి కాపలాగా ఉండే దేవర కథను ఓ కేసును ఛేధించడం కోసం వచ్చిన పోలీస్ ఆఫీసర్ (అజయ్)కు సింగప్ప (ప్రకాశ్‌రాజ్)తో చెప్పిస్తూ కథను నడిపించారు.

కలగలిపి దేవర మూవీని వండిన కొరటాల శివ జూనియర్ ఎన్టీఆర్, కొరటాల శివది క్రేజీ కాంబినేషన్. వీరిద్దరి కలయికలో 'జనతా గ్యారేజ్' వంటి సూపర్‌హిట్ సినిమా వచ్చింది. మళ్లీ ఎనిమిదేళ్ల తర్వాత ఇద్దరి కాంబినేషన్‌లో వచ్చిన చిత్రం దేవర. సక్సెస్ కాంబో కావడం, ఆరేళ్ల తర్వాత తారక్ సోలోగా తెరపై కనిపిస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగా ఉన్నాయి. కథలకి వెళితే..ఎర్ర సముద్రం తీరంలో గల రత్నగిరి ప్రాంతంలో నాలుగు గ్రామాలు ఉంటాయి. బ్రిటీష్ కాలం నాటి చరిత్ర ఆ ఊరికి ఉంటుంది. ఆ ప్రాంత వాసులు తమ జీవనం సాగించడం కోసం మురుగ (మురళీ శర్మ) కోసం సముద్రం మార్గంలో అక్రమంగా రవాణా జరిగే సరుకును కోస్ట్‌గార్డ్‌లకు చిక్కకుండా మురుగకు అందజేయడం వారి పని. అలా వచ్చిన మొత్తంతో కుటుంబాన్ని పోషిస్తారు. ఆ నాలుగు గ్రామాల్లో ఒక గ్రామంలో నివశించే దేవర భయానికే భయం పుట్టించేంత వీరుడు. సముద్ర మార్గం గుండా వచ్చిన ఆయుధాల వల్ల తమ ప్రాంతానికి చెందిన ఓ పిల్లాడి ప్రాణం పోయిందని తెలిసి ఇకపై మురగ దగ్గర పని చేయకూడదని, మరో మార్గంలో పని



# డైరెక్టర్‌కు అస్వస్థత రకుల్ హిందీ షూటింగ్ రద్దు

కెరటం సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హాయ్ చెప్పింది ఢిల్లీ భామ రకుల్ ప్రీత్ సింగ్. హీరోయిన్‌గా వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ సినిమాతో టాలీవుడ్‌లో మంచి బ్రేక్ అందుకుంది. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో స్టార్ హీరోలతో సినిమాలు చేస్తూ వన్ ఆఫ్ ది లీడింగ్ హీరోయిన్‌గా కొనసాగిన ఈ భామ తెలుగు సినిమాలో కనిపించక చాలా కాలమే అవుతుంది. ప్రస్తుతం హిందీ ప్రాజెక్టులపైనే ఫోకస్ పెట్టింది. ఈ భామ అజయ్ దేవ్‌గన్, టబు ప్రధాన పాత్రలు పోషిస్తున్న దే దే ప్యార్ దే 2లో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ చిత్ర షూటింగ్ కొన్ని రోజులుగా పాటియాలో జరుగుతుంది. అయితే అనుకోకుండా సినిమా షూటింగ్ రద్దయినట్టు ఓ వార్త బయటకు వచ్చింది. తాజా టాక్ ప్రకారం మూడీ డైరెక్టర్ అన్షుల్ శర్మ అస్వస్థతకు లోనవడంతో రెండు రోజులపాటు చిత్రీకరణ నిలిపేసినట్టు తెలుస్తోంది. అన్షుల్ వర్మ డెంగ్యూ అని నిర్ధారణ కాగా.. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నాడని బీటౌన్ సర్కిల్ సమాచారం. అన్షుల్ శర్మ ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా సినిమా మరో నెలపాటు వాయిదా వేసినట్టు తెలుస్తోంది. దే దే ప్యార్ దే 2 షూటింగ్ మళ్లీ నవంబర్‌లో మొదలు కానున్నట్టు ఇన్‌సైడ్ టాక్. రకుల్ ప్రీత్ సింగ్ వన్ ఆఫ్ ది ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోన్న ఇండియన్ 3 పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది.



# ఓటీటీలోకి వచ్చేసిన భలే ఉన్నాడే మూవీ

ఇటీవల పురుషోత్తముడు, తిరగబడరా సామి అంటూ వరుస చిత్రాలతో పలకరించిన రాజ్ తరుణ్ తాజాగా నటించిన భలే ఉన్నాడే సినిమా పక్షం రోజులకే డిజిటల్ స్ట్రీమింగ్‌కు రెడీ అయింది. సెప్టెంబర్ 13న థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా మంచి పాజిటివ్ టాక్ తెచ్చుకుంది. గీత సుబ్రహ్మణ్యం' సిరీస్‌తో ట్రెండ్ సృష్టించిన దర్శకుడు శివ సాయి వర్ధన్ ఈ మూవీతో వెండితెరకు పరిచయమయ్యాడు. మనీషా కందుకూర్ హీరోయిన్‌గా నటించగా అభిరామి, హైపర్ ఆది, సింగీతం శ్రీనివాసరావు, లీలా శాంసన్, గోపరాజు రమణ వంటి నటులు కీలక పాత్రల్లో నటించారు. కథ విషయానికి వస్తే.. రాధ (రాజ్‌తరుణ్) వైజాగ్‌లోని ఓ మధ్యతరగతి కుర్రాడు. శారీ డ్రేపర్ (ఫంక్షన్‌లో అమ్మాయిలకు చీర కట్టే వృత్తి) పని చేస్తుంటాడు. తల్లి గౌరి( అభిరామి) బ్యాంక్ ఉద్యోగి. కృష్ణ (మనీషా కంద్కూరు) మోడ్రన్ గర్ల్. ప్రేమ, పెళ్లి విషయాల్లో కొన్ని ఆలోచనలతో ఉంటుంది. అయితే రాధను చూడకుండా, ఎవరో తెలియకుండానే శారీ డ్రేపర్‌గా ఉన్న పరిచయంతో రాధతో ప్రేమలో పడుతుంది. తర్వాత రాధ కూడా ప్రేమలో పడతాడు. ఓ సమయంలో కృష్ణ అవకాశమిచ్చినా రాధ హద్దు మీరకుండా పద్దతిగా ఉంటాడు. కొంత కాలానికి పెద్దల అంగీకారంతో వీళ్లిద్దరూ పెళ్లికి సిద్ధమై నిశ్చితార్థం జరుగుతున్న సమయంలో కృష్ణ స్నేహితురాలు ఆమెకు ఓ విషయం చెబుతుంది. దీంతో కృష్ణకు రాధ వ్యక్తిత్వంపై అనుమానం ఏర్పడి రాధ సంసారానికి పనికొస్తాడా లేదా అని పరీక్షించడానికి ప్రయత్నం చేస్తుంది. తర్వాత ఏమైంది. పీటల దాకా వచ్చిన పెళ్లి ఎందుకు ఆగింది అనేది మిగతా కథ.

# సుదర్శన్ థియేటర్ వద్ద హంగామా

పటాకులు పేల్చడంతో దేవర కటౌట్ దగ్ధం


భారీ అంచనాల మధ్య ప్రపంచ వ్యాప్తంగా దేవర ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తెలుగు రాష్ట్రాల్లో గత రాత్రి ఒంటి గంటకు ప్రీమియర్ షోలు ప్రారంభమైన ఈ సినిమాకి ప్రేక్షకుల నుంచి మిక్స్‌డ్ రెస్పాన్స్ వస్తోంది.



సాధారణంగా స్టార్ హీరోల సినిమా విడుదలైనప్పుడల్లా అభిమానులు థియేటర్ల వద్ద హంగామా చేస్తుంటారు. కానీ వారి మితిమీరిన ఉత్సాహం కొన్నిసార్లు థియేటర్లలో ప్రమాదాలకు దారి తీస్తుంది. ఇలాంటి ఘటనే హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సుదర్శన్ 35 ఎంఎం థియేటర్ వద్ద చోటుచేసుకుంది. దేవర' విడుదల సందర్భంగా థియేటర్ ఆవరణలో అభిమానులు సంబరాలు చేసుకుంటుండగా, ఎన్టీఆర్ కటౌట్‌కు మంటలు అంటుకుని దగ్ధం కావడంతో పాటు కొద్దిసేపటికే మంటలు చుట్టూ భారీగా చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది వెంటనే రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అదృష్టవశాత్తూ ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు. కటౌట్‌పై ఉన్న పూలదండల మధ్య పటాకులు కాల్చడంతో మంటలు చెలరేగినట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# దేవర విడుదలతో ఎన్టీఆర్ జోష్ అభిమానులకు ఎక్స్ వేదికగా కృతజ్ఞతలు

ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వం వహించిన చిత్రం 'దేవర'. జాన్వీకపూర్, సైఫ్‌అలీఖాన్ కీలక పాత్రలు పోషించారు. ఎన్నో అంచనాల మధ్య ఈ చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈనేపథ్యంలోనే 'దేవర' రిలీజ్‌ను పురస్కరించుకొని సినీ ప్రియులు, అభిమానులను ఉద్దేశించి ఎక్స్ (ట్విటర్) వేదికగా ఎన్టీఆర్ పోస్ట్ పెట్టారు. తాను ఎంతోకాలం నుంచి ఎదురుచూస్తున్న రోజు వచ్చిందని పేర్కొన్నారు. అభిమానులు చూపించే ప్రేమకు ఎప్పుడూ రుణపడి ఉంటానని అన్నారు. మా సినిమాపై మీరు చూపిస్తోన్న అభిమానాన్ని చూసి చాలా సంతోషంగా ఉంది. అద్భుతమైన డ్రామా, భావోద్వేగాలతో 'దేవర' తీర్చిదిద్దినందుకు థ్యాంక్యూ కొరటాల శివ. మై బ్రదర్ అనిరుధ్.. నీ మ్యూజిక్‌తో మా ప్రపంచానికి ప్రాణం పోశావు. ఈ చిత్రానికి బలమైన సపోర్ట్‌గా నిలిచిన మా నిర్మాతలు మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ.కె, అద్భుతంగా వర్క్ చేసిన సినిమాటోగ్రాఫర్ రత్నవేలు, సాబు సిరిల్‌తోపాటు టెక్నీషియన్స్ అందరికీ కృతజ్ఞతలు. నా అభిమానుల వేడుకలు చూసి నా మనసు నిండింది. మీ ప్రేమాభిమానాలకు నేను ఎప్పుడూ రుణపడి ఉంటా. నాలానే మీరూ ఈ చిత్రాన్ని ఎంజాయ్ చేయడం చూస్తుంటే సంతోషంగా ఉంది. మీకు మరెంతో వినోదాన్ని అందిస్తానని మాటిస్తున్నా అని ఎన్టీఆర్ పేర్కొన్నారు.



VC NEWS వేగుచుక్క TELUGU DAILY NEWS







# ఘనంగా "సిఎంఆర్" షాపింగ్ మాల్ ప్రారంభం.

- ♦ ప్రారంభించిన ఎంపీ అరవింద్, పాల్గొన్న ఎమ్మెల్యే దన్ పాల్.
- ♦ సినితారలు రామ్ పోతినేని, పాయల్ రాజ్ పుత్ సందడి.
- ♦ 35వ షోరూం నిజామాబాద్ లో ప్రారంభించటం సంతోషం.
- ♦ సీఎంఆర్ చైర్మన్ మావూరి వెంకటరమణ, డైరెక్టర్ మావూరి మోహన్ బాలాజీ.

**వేగుచుక్క న్యూస్, నిజమాబాద్, సెప్టెంబర్ 27:**

సీఎంఆర్ షాపింగ్ మాల్ 35వ వ స్టోరును నగరంలోని హైదరాబాద్ రోడ్, ఫులాంగ్ చౌరస్తా వద్ద శుక్రవారం ఘనంగా ప్రారంబించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాలలో అతి పెద్ద వస్త్ర వ్యాపార సంస్థ అయిన సిఎంఆర్ టెక్స్టైల్స్, జ్యూయలర్స్ ప్రైవేట్ లిమిటెడ్ మాల్ ను నిజామాబాద్ పార్లమెంటు సభ్యులు ధర్మపురి అరవింద్ అట్టహాసంగా ప్రారంభించగా, అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ, మేయర్ నీతూ కిరణ్ పాల్గొన్నారు. సినీ హీరో రామ్ పోతినేని, సినీతార పాయల్ రాజ్ పుత్ లు వేడుకల్లో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, సందడి చేశారు. అభిమానులకు అభివాదం చేసి, డ్యాన్సులు వేస్తూ నగర ప్రజలను అలరించారు. ఈ సందర్భంగా హీరో రామ్ పోతినేని మాట్లాడుతూ, సిఎంఆర్ గత 40 సంవత్సరాలుగా వస్త్ర వ్యాపార రంగంలో క్వాలిటీకి, డిజైన్స్కు ప్రత్యేకతగా నిలుస్తూ, తెలుగు రాష్ట్రాలలో అగ్రగామిగా నిలిచిందని కొనియాడారు. సిఎంఆర్ అంటే కుటుంబమంతటికీ మెచ్చే కంప్లీట్ ఫ్యామిలీ షాపింగ్ మాల్ అని చెప్పారు. హీరోయిన్ పాయల్ రాజ్ పుత్ అన్ని సెక్షన్లు తిరిగి పరిశీలించారు. సిఎంఆర్ అంటేన క్వాలిటీలో రారాజన్నారు, ప్రస్తుత తరానికి అనుగుణంగా అన్నిరకాల వెరైటీలు ఉన్నాయన్నారు. ఇక్కడ అన్ని రకాల వస్త్రాలు అందరికీ అందుబాటు ధరలలో ఉన్నాయని కొనియాడారు. సిఎంఆర్ ఫౌండర్, చైర్మన్ మావూరి వెంకటరమణ మాట్లాడుతూ , తమ సంస్థను గత 4 దశాబ్దాలుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రజలు ఆదరిస్తున్నారని, మాయొక్క 35వ షోరూమును నిజామాబాద్ లో ప్రారంభించటం చాలా సంతోషంగా ఉందన్నారు. సిఎంఆర్ లో షాపింగ్ అంటే ప్రపంచ స్థాయి అనుభూతి కలిగేలా ఉంటుందన్నారు. ప్రజలు తమకు కావాల్సిన అన్నిరకాల వేడుకలకు, అన్ని మోడల్స్ లో కుటుంబమంతటికీ నచ్చే విధంగా, ప్రజలకు అతి తక్కువ ధరలకే అందించటం తమ ప్రత్యేకత అన్నారు. తమ సొంత మగ్గాల పై నేయించిన వస్త్రాలను మార్కెట్లో మరెవ్వరూ ఇవ్వని ధరలకు సిఎంఆర్ అందిస్తుందన్నారు. సిఎంఆర్ మేనేజింగ్ డైరెక్టర్ మావూరి మోహన్ బాలాజీ మాట్లాడుతూ, సిఎంఆర్ అంటే ది వన్ స్టాప్ షాప్ అని, ఫ్యామిలీ అందరికీ నచ్చే విధంగా అన్ని రకాల వెరైటీలు, డిజైన్స్ లభిస్తాయన్నారు. తమ వద్ద అందరికీ అందుబాటు ధరలలో లక్షలలో డిజైన్లు వేలల్లో వెరైటీలు లభిస్తాయన్నారు.

















